క్లుప్తంగా

17న స్వచ్ఛత లీగ్

బడంగ్‌పేట్: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17న ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ సుమన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా అల్మాస్‌గూడలోని కోమటికుంట చెరువు శుద్ధి పనులు, అలాగే బడంగ్‌పేటలోని 30వ డివిజన్‌లోని బట్టేల్‌గుట్ట పార్కు వద్ద పారిశుద్ధ్య పనులు చేపడతామన్నారు. చివరగా 10 గంటలకు బడంగ్‌పేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీలకు వాల్ పేయింటింగ్ వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొనేందుకు సిటిజన్స్, యూత్, ఎన్‌సీసీ, ఆర్‌డబ్ల్యూఏ, ఎన్‌జీఓస్ మరియు స్వచ్ఛంద సంస్థలు ఇష్టంగా పాల్గొనవచ్చని కమిషనర్ కోరారు. పాల్గొనాలనుకునేవారు తమ, సంస్థల పేర్లను బడంగ్‌పేట మున్సిపల్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు.

గొల్లకురుమల అభివృద్ధికి కృషి: జెడ్పీటీసీ



గొర్రెలను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ జంగారెడ్డి

కందుకూరు: గొల్ల, కురుమల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చిప్పలపల్లిలో గొల్లకురుమలకు మంజూరైన గొర్రెల యూనిట్లను గురువారం ఎంపీపీ మంద జ్యోతిపాండు, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డితో కలిసి జంగారెడ్డి..లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఒక్క చిప్పలపల్లిలోనే 27 యూనిట్లు మంజూరు కాగా 21 యూనిట్లు పంపిణీ చేశామన్నారు. మిగతావారికి అందిస్తామన్నారు. ఒక్కో యూనిట్‌కు రూ.43 వేలు చెల్లిస్తే ప్రభుత్వం రూ.1.75 లక్షల గొర్రెలను అందిస్తుందన్నారు. సమైక్య రాష్ట్రంలో గొల్లకురుమలను ఏ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కేసీఆర్ పాలనలో అన్నివర్గాలకు సముచిత న్యాయం అందుతుందని కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ బాలకృష్ణ, ఎంపీటీసీ లలిత కుమార్, మాజీ ఎంపీపీ మహేశ్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనంద్, పశు వైద్యాధికారిణి డాక్టర్ రేవతి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

తపాలా పథకాలపై అవగాహన ర్యాలీ




అవగాహన ర్యాలీలో పోస్టల్ సిబ్బంది

కందుకూరు: పోస్టాఫీస్ పథకాలపై డాక్ కమ్యూనిటీ డెవలెప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా పోస్టాఫీస్ సిబ్బంది గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం సమావేశపుహాల్లో శుక్రవారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులో ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, పాస్‌పోర్టు తదితర సేవలతో పాటు రూ.399కే రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం తదితరవాటిపై అవగాహన కల్పిస్తున్నట్లు ఎంఓ కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ కృష్ణయ్య, బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు జైపాల్‌రెడ్డి, భిక్షపతిపాల్గొన్నారు.

పులిమామిడిలో అమావాస్య హోమం

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో అమావాస్యను పురస్కరించుకుని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో గురువారం హోమాన్ని నిర్వహించారు. వివిధ రకాల సమస్యలతో పాటు రోగాల నివారణకు ప్రత్యేకంగా హోమాన్ని నిర్వహించి పూర్ణాహుతి చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతను అలవర్చుకుంటే ప్రశాంతంగా జీవించవచ్చన్నారు.

ఘనంగా చల్లా జన్మదిన వేడుకలు



నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

మీర్‌పేట: రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి జన్మదిన వేడుకలు గురువారం మీర్‌పేటలో కార్యకర్తలు, అభిమానుల మధ్య ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కార్యకర్తల మధ్య నర్సింహారెడ్డి కేక్ కట్ చేయగా ఆయనను గజమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో నాయకులు దేవగోని కృష్ణ, కార్పొరేటర్లు చల్లా కవితాబాల్‌రెడ్డి, సిద్దాల మౌనిక శ్రీశైలం, ఎరుకల వెంకటేష్‌గౌడ్, కీసర యాదిరెడ్డి, ఏడుదొడ్ల సురేందర్‌రెడ్డి, ఆల శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌కేపురం, సరూర్‌నగర్, బడంగ్‌పేట, కందుకూరు, మహేశ్వరం ప్రాంతాల నుంచి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

రహదారి గోతులమయం

- మీర్‌పేటలో ధ్వంసమైన రోడ్లు
- అల్మాస్‌గూడ వద్ద నిత్యం ట్రాఫిక్‌జాం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



సిర్లాహిల్స్ చౌరస్తాలో..



సర్వోదయనగర్ ప్రధాన రోడ్డు పరిస్థితి

మీర్‌పేట: కార్పొరేషన్‌లో అది ప్రధాన రహదారి... కొన్నినెలల క్రితమే రోడ్డును విస్తరించి అన్ని హంగులతో అభివృద్ధి చేశారు.. ఇటీవల కురిసిన వర్షాలతో రహదారిపై మధ్యలో గుంతలు పడటంతో పాటు, ధ్వంసం కావడంతో వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మీర్‌పేట నుంచి అల్మాస్‌గూడ ముఖద్వారం వరకు ఇటీవల ప్రధాన రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. కానీ రహదారిపై ఉన్న మ్యాన్‌హోళ్లే వాహనదారుల పాలిట ప్రమాదకరంగా మారాయి. సర్వోదయనగర్ కాలనీ ముఖద్వారం, సిర్లాహిల్స్ చౌరస్తా వద్ద రహదారి ధ్వంసమైంది. అభివృద్ధి చేసిన కొన్నినెలలకే రోడ్డు పరిస్థితి ఇలా ఉండటంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మ్యాన్‌హోల్ గుంతలు ఉన్నచోట ప్రమాదకరంగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు.

ధ్వంసమైన రహదారి...

సర్వోదయనగర్ కాలనీకి వెళ్లే మార్గంలో ప్రధాన రహదారి సగం వరకు ధ్వంసం కావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. దీనికి తోడు ఇక్కడ రహదారి మరీ చిన్నదిగా, మరో వైపు వైన్‌షాపు ఉండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్‌జామ్ అయి వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అసలే రహదారి ఇరుకుగా ఉండటం,ధ్వంసం కావడంతో ఇక్కడ తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని కార్పొరేషన్ అధికారులు స్పందించి ధ్వంసమైన చోట మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపడతాం

సర్వోదయనగర్ ప్రధాన రహదారిపై చెట్టు ఉండటంతో పాటు నీరు నిలుస్తుండటంతో సమస్యగా మారింది. దీంతో వాహనదారులకు ఇబ్బందులు పడుతున్నారు. ధ్వంసమైన చోట మరమ్మతులు చేపడతాం.

– గోపీనాథ్, డీఈ, మీర్‌పేట కార్పొరేషన్

ఓటుతో బ్రాహ్మణుల సత్తాచాటాలి

వనస్థలిపురం: బ్రాహ్మణుల సంఖ్య తక్కువని అన్ని రాజకీయ పార్టీలు మనల్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని, ప్రతి బ్రాహ్మణుడు ఓటు హక్కును వినియోగించుకొని సంఖ్యాబలాన్ని చాటాలని బ్రాహ్మణ సేవా వాహిని రాష్ట్ర అధ్యక్షుడు రఘుకిరణాచార్యులు అన్నారు. గురువారం బ్రాహ్మణ సేవా వాహిని ఆధ్వర్యంలో వనస్థలిపురం అభ్యుదయనగర్‌లో బ్రాహ్మణ రాజకీయ పరిరక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘుకిరణాచార్యులు మాట్లాడుతూ, హైదరాబాద్ నగరంలోని అనేక నియోజకవర్గాలలో ఉన్న బ్రాహ్మణులంతా ఏకమైతే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభావితం చేయాలనే ఉద్దేశంతోనే ఈ సమావేశం నిర్వహించామన్నారు. బ్రాహ్మణ సంఘాలన్నీ ఏకమైతే అన్ని నియోజకవర్గాలలో బ్రాహ్మణ భవన్, అపర కర్మల భవనం, అన్ని రకాల ప్రాముఖ్యతను ఇచ్చే వారికి పార్టీతో సంబంధం లేకుండా మద్దతు ఇవ్వొచ్చని అన్నారు. బ్రాహ్మణులు పోటీచేసే ప్రాంతంలో వారికే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. త్వరలో వేలాది మంది బ్రాహ్మణులతో గ్రేటర్ హైదరాబాద్‌లో భారీ సభను నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సేవా వాహిని ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరశర్మ, మంగపతిరావు, వక్కలంక శ్రీనివాస్, ఆలూరి, ఏవీఆర్ మూర్తి, గిరి, ప్రసాద్, శ్రీనివాస రంగాచార్యులు, కృష్ణమాచార్య, రంగబాబు, ప్రమోద్,సుధాకర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



అభ్యుదయనగర్‌లో సమావేశమైన బ్రాహ్మణ ప్రతినిధులు

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 11, వంకాయ 23, బెండ 28, పచ్చిమిర్చి 35, కాకర 20, బీర 23, క్యాబేజీ 13, ఫ్రెంచిబీన్స్ 55, క్యారెట్ 33, దొండ 18, చిక్కుడు 45, గోకర 23, బీట్‌రూట్ 20, క్యాప్సికం 33, ఆలు 21, దోస 18, సొర 9, పొట్ల 18, ఉల్లిగడ్డ 29, చామగడ్డ 35. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



అధ్యాపకుల వేషధారణలో విద్యార్థులు

కందుకూరు: మండలంలోని కొత్తగూడ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు.. అధ్యాపకులు, అధికారులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. వివిధ సబ్జెక్టులను బోధించారు. ప్రతిభచాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఉమాదేవి అభినందించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీలత, శేఖర్, మంజులాదేవి, సత్యేందర్‌జీ, వెంకన్న, రామారావు, రాంరెడ్డి, శ్రీనివాస్, రాధ, ప్రవీణ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకే డబుల్ ఇళ్లు ఇవ్వాలి

- కొనసాగుతున్న ధర్నా



నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను స్థానికులకు కేటాయించాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా గురువారంతో 6వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వార్డు కార్యాలయం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జేఏసీ సభ్యులు మాట్లాడుతూ.. తమ గ్రామ రైతు భూముల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలు నగరవాసులకు ఇచ్చి, తమ గ్రామానికి చెందిన నిరుపేదలకు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్థానికులకు న్యాయం చేయాలన్నారు. ఇళ్లను సాధించేవరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు.

నిరుద్యోగులను విస్మరించిన సర్కార్

- కిషన్‌రెడ్డి అరెస్టుపై మండిపడ్డ బీజేపీ శ్రేణులు
- సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మల దహనం



కందుకూరు: సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



బడంగ్‌పేట: ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

కందుకూరు: రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు నిరుద్యోగ భృతి కల్పించాలనే డిమాండ్‌తో ధర్నాచౌక్ వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేపట్టిన దీక్షను అడ్డుకుని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ గురువారం కందుకూరులో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పంచాయతీరాజ్ జిల్లా కన్వీనర్, కొత్తగూడ సర్పంచ్ సాధ మల్లారెడ్డి మాట్లాడారు. తెలంగాణలో నిరుద్యోగులను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. నిరుద్యోగుల తరపున పోరాటం చేస్తుంటే అణిచివేయడం సిగ్గు చేటని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలే బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు. ఎంపీటీసీ మల్లేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ పర్వతాలు, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నర్సింహారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి, వెంకటేశ్, కిసాన్‌మోర్చా జిల్లా నాయకులు కృష్ణకుమార్, సత్తిరెడ్డి, మల్లేశ్, యువమోర్చా జిల్లా నాయకులు వరుణ్, మండల నాయకులు వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, గణేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: నిరుద్యోగ సమస్యలపై హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద శాంతియుతంగా ధర్నా చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ గురువారం తుక్కుగూడలో ఆపార్టీ నాయకులు సీఎం కేసీఆర్‌దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, మున్సిపల్ చైర్మన్ మధుమోహన్, కౌన్సిలర్లు శివకుమార్, యాదగిరిరెడ్డి, రాజు, నాయకులు రాజుగౌడ్, సుధాకర్, శ్రీనివాస్ నాయక్, దేవేందర్, బాలరాజ్, శ్రీశైలం, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేటలో..

బడంగ్‌పేట్: నిరుద్యోగ సమస్యలపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి చేపట్టిన నిరహార దీక్షను బీఆర్‌ఎస్ ప్రభుత్వం భగ్నం చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం బడంగ్‌పేటలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలప్పుడు ఇంటికొక ఉద్యోగం, నిరుద్యోగభృతి, యువతకు ఉపాధి, డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇస్తానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారన్ని.. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ ఆధ్వర్యంలో కిషన్‌రెడ్డి నిరహారదీక్ష చేస్తుంటే కుట్ర పూరితంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ శ్రీధర్‌రెడ్డి, ఇంద్రాసేన, శ్రీకాంత్‌గౌడ్, ఐలయ్య, ప్రభాకర్, శ్రీను, ప్రకాష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, తదితరులున్నారు.

క్రీడాకారులకు ఫిట్‌నెస్ ముఖ్యం

- డాక్టర్ కృష్ణ సుబ్రహ్మణ్యం



బహుమతులు అందజేస్తున్న అతిథులు

హుడాకాంప్లెక్స్: క్రీడాకారులకు ఫిట్‌నెస్ ఎంతో ముఖ్యమని.. ఫిట్‌గా ఉంటేనే క్రీడల్లో రాణించవచ్చని ప్రముఖ ఆర్థో డాక్టర్ కృష్ణ సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం మలక్‌పేట యశోద హాస్పిటల్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులకు, ట్రైనీస్, చిన్నావారి నుంచి పెద్దవారి వరకు ఈ మేరకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాయాలు అయినప్పుడు ఎలాంటి వైద్యుల సలహాలు తీసుకోవాలో, గాయాలు కాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో దాదాపు 180 మంది క్రీడాకారులకు పవర్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. నేషనల్ స్పోర్ట్స్ డే నాడు జరిగిన క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ పెద్ద అంబర్‌పేట ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, 11కేవీ కొహెడ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని డీఈ కోరారు.

ల్యాబ్ ఏర్పాటు అభినందనీయం

తుర్కయంజాల్: ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకురావడం అభినందనీయమని పురపాలక సంఘం పరిధిలోని 10వ వార్డు కౌన్సిలర్ అనురాధ అన్నారు. గురువారం రాగన్నగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షైన్ ఎన్‌జీఓ, స్టార్స్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్ట్‌గా పాఠశాలను ఎంపిక చేసి, విద్యార్థులకు నాణ్యమైన కంప్యూటర్ విద్యను అందించడం మంచి పరిణామమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో షైన్ వ్యవస్థాపకురాలు పరమేశ్వరి, స్టార్స్ సంస్థ ప్రతినిధులు టీం బెట్టీ, రఫేల్, విజయ్ యా దవ్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకే మిషన్ భగీరథ: సీఈ

కద్తాల్: ప్రజల దాహార్తి తీర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ప్రవేశపెట్టిందని ఆ పథకం చీఫ్ ఇంజనీర్ చంద్రమౌళి అన్నారు. గురువారం మండల కేంద్రంలో మిషన్ భగీరథ నీటి సరఫరాను గ్రామ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డితో పాటు సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా రాష్ట్రంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటునట్లు తెలిపారు. కద్తాల్‌కు ప్రతిరోజు 4.8 లక్షల లీటర్ల నీటిని అందిస్తున్నామని తెలిపారు. ప్రజా అవసరాల నిమిత్తం అదనంగా మరో లక్ష లీటర్ల నీటి ట్యాంకును అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ట్యాంకుకు సంబంధించి నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు.

తుక్కుగూడ సభకు తరలిరండి

- మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్(ఈ-సిటీ)లో కాంగ్రెస్ పార్టీ ఈనెల 17న నిర్వహించే విజయభేరి బహిరంగ సభ ఏర్పాట్లను గురువారం మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తమ పార్టీ ఐదు డిక్లరేషన్ అంశాలతో ఈ సభను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు కాంగ్రెస్ అగ్ర నాయకులు.. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు ఇతర ఏఐసీసీ నాయకులు హాజరువుతారన్నారు. కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మల్‌రెడ్డి రాంరెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, జానకీరామ్, ధన్‌రాజ్‌గౌడ్, రవికుమార్, యాదయ్య, వినోద్‌చారి, నారాయణ, కళ్యాణ్, ప్రవీణ్, ప్రసాద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తండాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ జంగారెడ్డి

కందుకూరు: తండాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తన చాంబర్‌లో గురువారం మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్టీ సబ్‌ప్లాన్ కింద మండలంలోని సార్లరావులపల్లి, పులిమామిడి, గాజులబురుజుతండా, గుమ్మడవెల్లి తండాకు బీటీ రోడ్ల నిర్మాణానికి గాను రూ.3.65 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. అందులో సార్లరావులపల్లికి రూ.30 లక్షలు, పులిమామిడికి రూ.2కోట్లు, గాజులబురుజుతండాకు రూ.50 లక్షలు, గుమ్మడవెల్లితండాకు రూ.85 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి చొరవతో అన్ని గ్రామాలకు నిధులు పెద్ద ఎత్తున మంజూరవుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో సబితారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మహేశ్‌గౌడ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు దశరథ, డైరెక్టర్ ఆనంద్, సర్పంచ్ శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు విఘ్నేశ్వర్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ దీక్షిత్‌రెడ్డి, కార్యాలయ కార్యదర్శి వెంకటేష్, యూత్ ఉపాధ్యక్షులు రామకృష్ణ, నాయకులు జంగయ్య, మాధవరెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

సోనియా రుణం తీర్చుకుందాం

- డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని నెరవేర్చిన ఏఐసీసీ నాయకురాలు సోనియాగాంధీ రుణం తీర్చుకుందామని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిద్దామని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ నెల 17న తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ పార్టీ విజయభేరి సభను విజయవంతం చేయాలని కోరుతూ, మండల కేంద్రంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2లక్షల రుణమాఫీతో పాటు, రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, నిరుద్యోగులకు ఎక కాలంలో 2లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి నెలకు రూ.4 వేలు, రైతులకు గిట్టుబాటు ధర, రూ.5 లక్షలతో ఆరోగ్య శ్రీ పథకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. విజయభేరి సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, పట్టణ అధ్యక్షుడు రాంచందర్ నాయక్, నాయకులు మల్లేశ్‌గౌడ్, యాదయ్యగౌడ్, సత్యంయాదవ్, శ్రీను, బోసు రవి, భానుకిరణ్, శ్రీకాంత్, రమేశ్ ఉన్నారు.

జైపాల్‌యాదవ్ గెలుపు కష్టమే

- బీఆర్‌ఎస్‌కు ఆదరణ
- అభ్యర్థిపై వ్యతిరేకత
- నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం
- ఎంపీపీ అనిత



సమావేశంలో మాట్లాడుతున్న అనిత

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ ఉందని, కానీ అభ్యర్థి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌పై తీవ్ర వ్యతిరేకత ఉందని ఆమనగల్లు ఎంపీపీ అనిత అన్నారు. కల్వకుర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వంపై అధిష్టానం పునరాలోచన చేయాలని కోరారు. ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అనిత మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు అభివృద్ధిలో ముందుంటే కల్వకుర్తి నియోజకవర్గంలో మాత్రం అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. ఎమ్మెల్యే వల్లే నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిపోయిందని ఆరోపించారు. ఆమనగల్లులో ప్రభుత్వం గిరిజన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తే శిలాఫలకానికే పరిమితమైందన్నారు. మేడిగడ్డ నుంచి శంకరకొండతండా రోడ్డులో బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.10 కోట్లు మంజూరైతే జైపాల్‌యాదవ్ ఏడాదిక్రితం పనులు ప్రారంభించారని ఇంతవరకు ఒక్కశాతం పనికూడా కాలేదని విమర్శించారు. సమావేశంలో నాయకులు శ్రీను, శివలింగం, పరమేశ్, వెంకటయ్య, కృష్ణారెడ్డి, శేఖర్, నరేశ్, ప్రభాకర్, విజయ్‌రాథోడ్ పాల్గొన్నారు.

తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం

చైతన్యపురి: తలసేమియా, సికిల్ సెల్ అనీమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయటం సంతోషదాయకమని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ సురేష్‌గుప్తా అన్నారు. తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్, మారుతి టెక్నాలజీ, ఎస్‌వీ ఇన్ఫోటెక్ సంయుక్త ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సురేష్‌గుప్తా పాల్గొని మాట్లాడారు. రక్తదానం చేసిన 50 మంది యువకులను ఆయన అభినందించారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం అందక తలసేమియా పేషెంట్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మారుతి టెక్నాలజీ డైరెక్టర్ కె.మారుతి, ఎస్‌వీ ఇన్ఫోటెక్ డైరెక్టర్ కమలాకర్ రాజు, రోటరీ సర్వీసెస్ డైరెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.